


అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
J V NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 2 సంచిక - 262 ఆదివారం 11 జనవరి 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## అదుపులోకి వచ్చిన బ్లో ఔట్

**పూర్తిగా ఆగిపోయిన మంటలు**

**స్వదేశీ పరిజ్ఞానంతోనే అదుపుచేసిన ఓఎన్‌జిసి**

**ఊపిరి పీల్చుకున్న చుట్టుపక్క గ్రామాల ప్రజలు**



కోనసీమ,జనవరి 10:
డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఇరుసుమండ వద్ద బ్లోఔట్ మంటలు అదుపులోకి వచ్చాయి. దీంతో అధికారులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఓఎన్జీసీ విపత్తు నిర్వహణా బృందం శకలాలను పూర్తిగా తొలగించిందని.. పూర్తి దేశీయ పరిజ్ఞానంతోనే ఓఎన్జీసీ సిబ్బంది మంటలార్పిందని తెలిపారు. అతి తక్కువ సమయంలోనే ప్రమాదాన్ని నియంత్రించి,మిగతా 2లో...

## వైద్యులు సామాజిక బాధ్యత మరవ వద్దు

**సాంకేతిక పరిజ్ఞానాన్ని అప్‌గ్రేడ్ చేసుకోవాలి**

**ఫెలోస్ ఇండియా కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి**



హైదరాబాద్,**జనవరి10 (జర్నలిస్ట్ వార్త):**
ప్రజలు, సమాజంపై వైద్యులు తమ బాధ్యతను ఎప్పటికీ మరచిపోవద్దని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. వైద్యులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అప్‌గ్రేడ్ చేసుకోవాలని.. అయితే, ప్రజల నాడి పట్టుకోవడం మరిచిపోవద్దని సీఎం సూచించారు. హైదరాబాద్ హెచ్‌ఐసీసీలో ఇంటర్నేషనల్ కార్డియాలజీ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫెలోస్ ఇండియా కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి మిగతా 2లో...



## హెచ్-1 వీసా ప్రాసెసింగ్ ఫీజులు పెంపు

**అమెరికా విదేశాంగ శాఖ కీలక నిర్ణయం**

వాషింగ్టన్,**జనవరి10 (జర్నలిస్ట్ వార్త):**
అమెరికా ప్రభుత్వం తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. వీసాల ప్రీమియం ప్రాసెసింగ్ ఫీజులు పెంచినట్టు పౌరసత్వ, వలస సేవల శాఖ తాజాగా వెల్లడించింది. కొత్త రేట్స్ మార్చ్ 1 నుంచి అమల్లోకి వస్తాయని తెలిపింది. హెచ్-1బీ, ఎల్-1 సహా పలు రకాల వీసా దరఖాస్తుల ప్రాసెసింగ్‌ను వేగవంతం చేసేందుకు అమెరికా ప్రీమియం ప్రాసెసింగ్ ఫీజును చార్జ్ చేస్తుంటుంది. హెచ్-1బీ లాంటి వీసాల విషయంలో గతంలో మిగతా 2లో...



## సోమ్‌నాథ్ చేరుకున్న ప్రధాని మోడీ

**సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్' సెలబ్రేషన్స్‌లో ప్రాల్గొననున్న మోడీ**

అహ్మదాబాద్,**జనవరి10 (జర్నలిస్ట్ వార్త):**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గుజరాత్‌లో మూడు రోజుల పర్యటనలో భాగంగా రాజ్‌కోట్‌లోని హీరసర్ విమానాశ్రయానికి శనివారంనాడు చేరుకున్నారు. రాష్ట్ర మంత్రి కుంవర్జీ బావలియా, రాజ్‌కోట్ మేయర్ తదితరులు ప్రధానిమిగతా 2లో...



## తెలంగాణలోని ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేయండి

**ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టును సత్వరం చేపట్టేలా చూడండి**

**హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటుకు సహకరించండి**

**ప్రీ బడ్జెట్ సమావేశంలో కేంద్రానికి భట్టి వినతి**

న్యూఢిల్లీ,**జనవరి10 (జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణలోని ప్రధాన ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేయాలని.. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు. శనివారం న్యూఢిల్లీలోని అశోకా హోటల్లో ప్రి బ్జడెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి.. ఈ మేరకు కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు. బడ్జెట్ ముందస్తు సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడిన ఆయనతెరాష్ట్రాలతో బడ్జెట్ ముందస్తు సంప్రదింపులు జరుపుతున్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మిగతా 2లో...

## మహిళా అధికారిపై తప్పుడు వార్తలు

**వారి కుటుంబాలు ఎంతగా బాధపడతాయో తెలియదా**

**కొడుకు చనిపోవడంతోనే నేను సగం చచ్చిపోయా**

**మీడియా కథనాలపై మంత్రి కోమటిరెడ్డి అసహనం**

హైదరాబాద్,**జనవరి10 (జర్నలిస్ట్ వార్త):**
కొందరు మంత్రులపై ఇటీవల వస్తున్న ఆరోపణల్ని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. కుటుంబాలను ఇబ్బందిపెట్టేలా రాతలు రాయొద్దని హితవు పలికారు. మహిళా ఐఏఎస్‌పైనా దుష్ప్రచారం చేయడం దురదృష్టకరమని కోమటిరెడ్డి వ్యాఖ్యానించారు. మంత్రి హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. మహిళా అధికారులపై పలు మీడియా సంస్థల్లో తప్పుడు కథనాలు ప్రసారం కావడంపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పందించారు. శనివారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. మహిళా అధికారులపై చెప్పలేని భాషలో కొన్ని ఛానల్స్, సోషల్ మీడియాలో వార్తలుమిగతా 2లో...



## సంక్రాంతి రద్దీ

**వరుసగా రెండోరోజూ పెరిగిన రద్దీ**

**హైదరాబాద- విజయవాడ మధ్య వాహనాలు బారులు**

**ప్రత్యామ్నాయా రూట్లలో వెల్లాలని పోలీసుల సూచన**



హైదరాబాద్,**జనవరి10 (జర్నలిస్ట్ వార్త):**
సంక్రాంతి పండగకు సొంతూళ్లకు వెళ్లేవారితో హైదరాబాద్-విజయవాడ హైవేపై వాహనాల రద్దీ పెరిగింది. వరుసగా రెండో రోజు శనివారం ఉదయం హైవేపై దారి పొడవునా వాహనాలు బారులు తీరాయి. చౌటుప్పల్, పంతంగి టోల్ ఎ÷-లాజా వద్ద వాహనాల రద్దీ పెరిగింది. మరోవైపు వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని పోలీసులు సూచిస్తున్నారు. మిగతా 2లో...

## గొడవలు పడితే నష్టపోయేది తెలుగువారే



**జగన్‌కు నాగరికత తెలిస్తే నదుల గురించి మాట్లాడరు**

**నదీ తీరాల్లోనో నాగరికత వెల్లి విరిసింది**

**సింధూ నాగరికత గురించి జగన్ చదివితే మంచిది**

**మీడియాతో ముఖ్యమంత్రి చంద్రబాబు**

అమరావతి,**జనవరి10 (జర్నలిస్ట్ వార్త):**
నీటి విషయంలో గొడవలు పడితే నష్టపోయేది తెలుగు ప్రజలేనని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. రెండు తెలుగురాష్ట్రాలు బాగుండేలా చూడటం తప్పెలా అవుతుందని ప్రశ్నించారు. మిగులు జలాలను సద్వినియోగం చేసుకుంటే రాష్ట్రాలు సుభిక్షంగా ఉంటాయన్నారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో సీఎం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. రాయలసీమకు నీరందించామనటానికి పట్టిసీమ ప్రత్యక్ష ఉదాహరణ అని గుర్తుచేశారు. ఆ ప్రాజెక్టు ఫలితంగానే ఉద్యానరంగం అభివృద్ధి చెందిందన్నారు. పూర్తిచేయకుండా 2020లోనే నిలిపివేసిన రాయలసీమ లిఫ్ట్‌తో స్వార్థరాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. కేవలం మట్టిపనులు చేసి రూ.900కోట్లు బిల్లులు చేసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రయోజనాలే తమకు ముఖ్యమని,మిగతా 2లో...

# వైద్యులు సామాజిక బాధ్యత మరవ వద్దు







(మొదటి పేజి తరువాయి)

ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గుండె జబ్బులను నివారించే మిషన్‌లో అందరూ భాగస్వాములు కావాలన్నారు. ప్రజారోగ్య సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ పాలసీలు మెరుగుపరచడానికి వైద్యులతో కలిసి పనిచేసేందుకు సిద్ధమని.. సూచనలు ఇవ్వాలని సీఎం పేర్కొన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు.. వైద్యులు స్వచ్ఛందంగా సీపీఆర్ నేర్పిస్తే చాలా మంది ప్రాణాలు కాపాడగలరని సీఎం అభిప్రాయపడ్డారు. తాను వైద్యుడిని కాకపోయినప్పటికీ.. సామాజిక రుగ్మతలకు చికిత్స చేసే డాక్టర్‌నని సీఎం వ్యాఖ్యానించారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ప్రభుత్వం, వైద్యులు కలిసి పనిచేద్దామని సీఎం అన్నారు. నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ కోసం అందరూ కృషి చేయాలని కోరారు. లైఫ్ సైన్సెస్, ఫార్మా, హెల్త్ కేర్ అనుబంధ రంగాల్లో ఆవిష్కరణల కేంద్రంగా హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఆరోగ్య సంరక్షణలో ప్రపంచంలోనే అత్యుత్తమంగా తెలంగాణ ఉండాలని సీఎం ఆకాంక్షించారు.

# గొడవలు పడితే నష్టపోయేది తెలుగువారే

(మొదటి పేజి తరువాయి)

నీటి విషయంలో రాజీపడేది లేదని మరోసారి స్పష్టం చేశారు. జగన్‌కు నాగరికత తెలిస్తే నదుల గురించి దుష్ప్రచారం చేయరని చంద్రబాబు అన్నారు. సింధు నాగరకత ఎలా వచ్చిందో అతను తెలుసుకుంటే మంచిదని హితవు పలికారు. దేశ రాజధాని దిల్లీ సహా ప్రధాన నగరాలు ఎక్కువగా నదీ తీరాల వెంబడి ఉండబట్టే అభివృద్ధి చెందాయని తెలిపారు. నదులు ఎక్కడ పుడతాయో, నాగరికత ఎక్కడ మొదలైందో జగన్ కి తెలియదని ముఖ్యమంత్రి ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. జగన్ కు కనీసం సింధూ నాగరికత గురించి కూడా అవగాహన లేదని మండిపడ్డారు. నదీగర్భానికి, నదీ పరివాహక ప్రాంతానికి తేడా తెలియకుండా మాట్లాడుతున్నారని ఆగ్రహించారు. దేశ రాజధాని ఢిల్లీ సహా ప్రధాన నగరాలు నదీతీరాల వెంబడి ఉన్నందునే అభివృద్ధి చెందాయని అన్నారు. అంతేకాదు లండన్ సహా ప్రపంచంలోని ప్రముఖ నగరాలు నదీ పరివాహక ప్రాంతంలోనే ఉన్నట్లు చెప్పుకొచ్చారు. ప్రజలు బుద్ధి చెప్పినా.. రాజధానిపై ఇప్పటికీ విషం చిమ్ముతూనే ఉన్నారని జగన్ పై నిప్పులు చెరిగారు చంద్రబాబు. లండన్ సహా ప్రపంచంలోని ప్రముఖ నగరాలూ నదీతీర ప్రాంతాల్లోనే ఉన్నాయని వివరించారు. నదీ గర్భానికి.. నదీ పరివాహక ప్రాంతానికి తేడా తెలియకుండా వైకాపా నేతలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ప్రజలు బుద్ధి చెప్పినా రాజధానిపై విషం చిమ్మటం మానట్లేదని ఆగ్రహం వ్యక్తం చేసారు. వచ్చే రెండేళ్లలో రాష్ట్రంలో నీటి కొరత లేకుండా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. నీటిని సద్వినియోగ చేసుకుంటున్నాం కాబట్టే రాయలసీమలో హార్టికల్చర్ అభివృద్ధి చెందిందన్నారు. దేశంలోనే ఉద్యాన రంగంలో మొదటి స్థానంలో ఉన్నాం.. రానున్న పదేళ్లలో ప్రపంచంలోనే నెంబర్ వన్ స్థానానికి వెళ్తామని పేర్కొన్నారు.ఏపీలో రానున్న రెండేళ్లలో నీటి కొరత లేకుండా ప్రణాళికలు రూపొందించాం. దేశంలోనే ఉద్యానవన రంగంలో అగ్రస్థానంలో ఉన్నాం. రానున్న పదేళ్లలో ప్రపంచంలోనే నెంబర్-1గా నిలుస్తాం. దేశంలో ప్రతి రాష్ట్రం మనల్ని చూసి నేర్చుకునేలా ముందుకు సాగుతాం. నీటి విషయంలో గొడవలకు పోతే నష్టపోయేది తెలుగు ప్రజలే. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు బాగుండాలనుకోవడం తప్పా?. మిగులు జలాలను సద్వినియోగం చేసుకుంటే రాష్ట్రాలు సుభిక్షంగా ఉంటాయన్న విషయం ఆయనకి అర్థం కావడం లేదు. రాయలసీమకు నీరు అందించామన దానికి పట్టిసీమే ప్రత్యక్ష ఉదాహరణ. పట్టిసీమ ద్వారా రాయలసీమపై మాకున్న చిత్తశుద్ధిని చాటుకున్నాం. అందుకే ప్రజలు మా పాలన కోరుకున్నారు. పట్టిసీమ వల్లే రాయలసీమలో ఉద్యానరంగం అభివృద్ధి పూర్తి చేయకుండా 2020లోనే నిలిపివేశారు. రాయలసీమ లిఫ్ట్ పేరుతో స్వార్థ రాజకీయాలు చేస్తున్నారు. కేవలం మట్టి పనులు చేసి రూ.900 కోట్లు బిల్లులు క్లయిమ్ చేసుకున్నారంటే ఆ ప్రభుత్వంలో దోపిడి ఏ విధంగా జరిగిందన్న విషయం ప్రజలు గమనించారు. రాయలసీమను రత్నాల సీమగా మార్చే సత్తా మాకుంది. తెలంగాణతో మాకు ఉన్న సమస్యలు పరిష్కరించుకుంటాం. రాజకీయాల కోసం 'సెంటిమెంట్లు రెచ్చగొట్టం' అని సీఎం చంద్రబాబు చెప్పారు.

# మహిళా అధికారిపై తప్పుడు వార్తలు

(మొదటి పేజి తరువాయి)

రాయడాన్ని మంత్రి తీవ్రంగా ఖండించారు. మహిళా అధికారులను బదిలీ చేసే అధికారం సీఎంకే ఉంటుందని.. జిల్లా మంత్రులకు చెప్పి ముఖ్యమంత్రి బదిలీ చేయరని స్పష్టం చేశారు. ఎంతో కష్టపడితే ఐఏఎస్, ఐపీఎస్ అవుతారని.. అలాంటి వారిపై అభాండాలు వేయొద్దని హితవుపలికారు. మహిళా అధికారులను మానసికంగా ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. రాజకీయాల్లో విమర్శలు, ప్రశంసలు సహజమని.. వాటిని తాము తట్టుకుంటామని.. కానీ ఐఏఎస్ అధికారుల ఫ్యామిలీ ఎలా తట్టుకుంటుందని మంత్రి కోమటి రెడ్డి ప్రశ్నించారు. 'మా మీద వేస్తే మేము, మా కుటుంబసభ్యులు, బంధువులు బాధపడతారు. రాసినవారు మేము చేసినట్లు చూశారా?.. దేవుడు అంటే నాకు నమ్మకం.. నేను తెలిసి ఏ తప్పు చేయను. నా కొడుకు చనిపోయినప్పుడే నేను సగం చనిపోయా. ఇంకా మానసికంగా ఇబ్బంది పెట్టొద్దు. నన్ను అవమానించి ఏం సాధిస్తారు?. నేను తప్పు చేస్తే దేవుడు శిక్షిస్తాడు' అని అన్నారు. ప్రభుత్వాన్ని అప్రదిష్ట పాలు చేయాలనే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. తప్పుడు వార్తల మీద విచారణ జరిపించాలని మంత్రి కోమటిరెడ్డి కోరారు. సినిమా టికెట్ల రేట్ల పెంపుపై మంత్రి కొమటిరెడ్డి స్పందిస్తూ.. సినిమా ఇండస్ట్రీ గురించి పట్టించుకోవడం మానేసినట్లు తెలిపారు. సినిమా టికెట్ల ధరల పెంపుపై తన దగ్గరకు రావొద్దని చెప్పానని.. దీంతో ఎవరూ తనను కలవడానికి రావడం లేదని చెప్పారు. పుష్ప సినిమా సందర్భంగా ఓ మహిళ చనిపోవడం బాధాకరమన్నారు. అప్పటి నుంచే టికెట్ల రేట్ల పెంపు కోసం తన దగ్గరకు రావొద్దని చెప్పానని ఆయన అన్నారు. నిన్నటి సినిమాకు టికెట్ల ధరల పెంపు, రేపటి సినిమాకూ టికెట్ రేట్లు పెంచిన విషయం తనకు తెలీదని చెప్పారు. టికెట్ల రేట్ల పెంపుపై తాను సంతకం చేయలేదని స్పష్టం చేశారు. ఆ విషయంలో ఏం జరుగుతుందో తెలీదని మంత్రి కోమటిరెడ్డి వెల్లడించారు.

సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లే వాహనాలతో రోడ్లపై రద్దీ పెరుగుతోందని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. బాటిల్ నెక్ ప్లేస్ ఉన్న వద్ద జామ్ ఎక్కువ అవుతోందన్నారు. ఈసారి 12 లక్షల వాహనాలు వెళతాయని అంచనా వేసినట్లు తెలిపారు. ఈరోజు నుంచి ట్రాఫిక్ జామ్ ఉంటుందని.. రద్దీ ఎక్కువ ఉన్నప్పుడు టోల్ ఛార్జీ లేకుండా గేట్ ఎత్తేయాలని చెప్పామని అన్నారు. ప్రత్యామ్నాయ రూట్స్‌లో ప్రయాణికులు వెళ్లాలని సూచించడం జరిగిందన్నారు. ప్రతీ 20 కిలోమీటర్లకు ఒక అంబులెన్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎమ్జుగ్గ÷న్సీ కోసం ఒక టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేశామన్నారు. ప్రమాదం జరిగితే అవసరమైతే హెలికాప్టర్‌లో హాస్పిటల్‌కు తరలిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు.

# సంక్రాంతి రద్దీ



(మొదటి పేజి తరువాయి)

భువనగిరి, రామన్నపేట మీదుగా చిట్యాలకు చేరుకోవాలని.. గుంటూరు, ఒంగోలు వైపు వెళ్లేవారు సాగర్ హైవే మీదుగా వెళ్లాలని సూచించారు. సంక్రాంతి సెలవులు ప్రారంభం కావడంతో ఎంజీబీఎస్, జేబీఎస్‌లో రద్దీ పెరిగింది. దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, ఉప్పల్, తార్నాక కూడళ్లు సందడిగా మారాయి. రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. మరోవైపు రైల్వేస్టేషన్లలో కూడా రద్దీ పెరిగింది. ప్రతి ఆదివారం చౌటుప్పల్‌లో సంత జరుగుతుంది. ఆ రోజు చౌటుప్పల్‌లో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ఈ ట్రాఫిక్ బాధలు తప్పాలంటే ఇలా కొత్త మార్గాల్లో వెళ్లడం ఉత్తమం అని పోలీసులు సూచించారు. శుక్రవారం సాయంత్రం నుంచే హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ మొదలైంది. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడకుండా పోలీసులు పటిష్ఠ చర్యలు చేపడుతున్నారు. హైవేపై వెళ్లే వాహనాలకు అంతరాయం కలగకుండా యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో నారాయణపురం రోడ్డును పోలీసులు మూసివేశారు. వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు చేపట్టినట్లు టోల్‌ప్లాజా నిర్వాహకులు తెలిపారు. సాధారణంగా దిల్‌సుఖ్‌నగర్ నుంచి చౌటుప్పల్‌కు ఒక గంటలో చేరుకోవచ్చు కానీ.. నిరుడు 'భోగి' ముందు రోజు 3 నుంచి 4 గంటల సమయం పట్టింది. అంతకు 2 రోజుల ముందు కూడా చాలా సమయం పట్టింది. శనివారం నుంచి సంక్రాంతి సెలవులు ప్రారంభమవుతుండటంతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ భారీగా పెరిగింది. మరోవైపు జాతీయ రహదారిపై అండర్‌పాస్ వంతెన, సర్వీసు రోడ్డు పనులు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నుంచి సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులు ట్రాఫిక్‌లో చిక్కుకొని ఇబ్బందులు పడే బదులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లడం మేలని పోలీసులు సూచిస్తున్నారు. హైదరాబాద్ నుంచి గుంటూరు, మాచర్ల, అద్దంకి, ఒంగోలు, నెల్లూరు వైపు వెళ్లే ప్రయాణికులు నార్కట్‌పల్లి వరకు వెళ్లి అద్దంకి జాతీయ రహదారిపై నుంచి వెళ్తుంటారు. వీరు విజయవాడ హైవే మీదుగా వస్తే హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్, చౌటుప్పల్, పంతంగి టోల్‌ఎ÷-లాజా వద్ద రద్దీలో చిక్కుకొనే అవకాశం ఉంటుంది. పదుల కిలోమీటర్లు దూరం పెరిగినా హైదరాబాద్-నాగార్జునసాగర్ హైవే మీదుగా వెళ్తే ప్రయాణం సాఫీగా సాగిపోతుంది. ఓఆర్ఆర్ మీదుగా వెళ్లాలనుకునేవారు బొంగుళూరు గేట్ వద్ద ఎగ్జిట్ తీసుకొని.. నాగార్జునసాగర్ హైవేపైకి వెళ్తే సరిపోతుంది. ఖమ్మం, విజయవాడ వైపు వెళ్లే ప్రయాణికులు భువనగిరి, రామన్నపేట మీదుగా చిట్యాలకు చేరుకోవచ్చు. నార్కట్‌పల్లి దాటితే వీరికి ట్రాఫిక్ తిప్పలు తప్పినట్లే. హైదరాబాద్ నుంచి భువనగిరి వైపు వెళ్లేందుకు ఓఆర్ఆర్ పైకి వెళ్లి ఘట్‌కేసర్‌లో ఎగ్జిట్ తీసుకొని.. వరంగల్ హైవేలోకి ప్రవేశించొచ్చు. సికింద్రాబాద్, తార్నాక, ఉప్పల్ మీదుగా కూడా నేరుగా భువనగిరికి చేరుకోవచ్చు.

# అదుపులోకి వచ్చిన బ్లో ఔట్

(మొదటి పేజి తరువాయి)

ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించామని తెలిపారు. కష్ట సమయంలో సమర్థవంతంగా పనిచేసిన అధికారుల కృషి అభినందనీయమని కొనియాడారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామని తెలిపారు. ఈనెల 5న ఓఎన్జీసీ యాజమాన్యంలోని మోరి-5 బావిలో గ్యాస్ లీక్ కారణంగా పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. దాదాపు 20 మీటర్ల ఎత్తున భారీ అగ్నికీలలు ఎగిసిపడటంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. మంటల నేపథ్యంలో ఇరుసుమండ, లక్కవరం, గుబ్బలపాలెం గ్రామాలకు చెందిన సుమారు 500- 600 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా పరిస్థితిని సమీక్షించారు. జిల్లా అధికారులు, ఓఎన్జీసీని సమన్వయం చేసి మంటలను అదుపు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు మంటలను అధికారులు అదుపులోకి తెచ్చారు. నీటి గొడుగు, కూలెంట్ ద్రవాలు, డెబ్రిస్ తొలగింపు వంటి చర్యలతో మంటల తీవ్రత తగ్గించారు. చివరకు ఈరోజు (జనవరి 10) ఉదయానికి మంటలు పూర్తిగా తగ్గుముఖం పట్టాయి. బ్లోఔట్ పూర్తిగా అదుపులోకి వచ్చింది. బ్లోఔట్ అదుపులోకి రావటంతో ఓఎన్జీసీ నిపుణులు సంబరాలు చేసుకున్నారు. బ్లోఔట్ ప్రాంతంలో స్వీట్స్ తినిపించుకుని సంతోషం వ్యక్తం చేశారు. అలాగే బ్లోఔట్ అదుపులోకి రావటంతో ఇరుసుమండ, లక్కవరం, గుబ్బలపాలెం గ్రామ ప్రజలంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇకపై ఓఎన్జీసీ కార్యకలాపాలు పూర్తిగా నిలిపివేయాలని స్థానిక గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.ఓఎన్జీసీ విపత్తు నిర్వహణా బృందం, ఢిల్లీ, ముంబై నుంచి వచ్చిన నిపుణులు, స్థానిక అగ్నిమాపక దళాలు కలిసి మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు ఎంతో కృషి చేశారు. నీటి గొడుగు, కూలెంట్ ద్రవాలు, డెబ్రిస్ తొలగింపు వంటి చర్యలతో మంటల తీవ్రత తగ్గించారు. చివరకు శనివారం ఉదయానికి మంటలు పూర్తిగా తగ్గుముఖం పట్టాయి. బ్లోఔట్ పూర్తిగా అదుపులోకి వచ్చింది.

# సోమ్‌నాథ్ చేరుకున్న ప్రధాని మోడీ

(మొదటి పేజి తరువాయి)



సాదర స్వాగతం పలికారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో సోమనాథ్‌కు ప్రధాని బయలుదేరారు. ప్రధాని తన పర్యటనలో ప్రఖ్యాత సోమనాథ్ ఆలయాన్ని దర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొనున్నారు. అనంతరం 'సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్' సెలబ్రేషన్స్‌లో పాల్గొంటారు.సోమనాథ్ ఆలయంపై 1026లో గజనీ మహ్మద్ దాడి చేసి విధ్వంసం చేశాడు. పలువురు విదేశీ పాలకులు కూడా ఆలయంపై దాడి చేసి దోచుకున్నారు. అప్పట్నించి ఆలయ పునరుద్ధరణ పనులతో సోమనాథ్ ఆలయం తన వైభవాన్ని చాటుకుంటూనే ఉంది. అయితే మొదటిసారి జరిగిన దురాగతానికి వెయ్యేళ్లు పూర్తి అవుతున్న సందర్భాన్ని పురస్కరించి సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ పేరుతో ఏడాదంతా వివిధ కార్యక్రమాలను తలపెట్టారు. ఈనెల 8 నుంచి 11 వరకూ వివిధ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా వేలాది మంది సాధువులు ఈ ఉత్సవాల్లో పాల్గొని ఆలయ ఆవరణలో జరిగే 72 గంటల ఓంకార (క్షప) ఉచ్ఛరణ కార్యక్రమంలో పాల్గొనున్నారు. సాయంత్రం ఉత్సవాల్లో భాగంగా డ్రోన్ షో, మంత్ర పఠనం ప్రత్యేక ఆకర్షణలు కానున్నారు.సర్దార్ పటేల్ సారథ్యంలో 1951లో ఆలయ పునర్మిర్మాణం జరిగి భక్తుల సందర్శన కోసం తలుపులు తెరుచుకున్నారు. 2026లో 75వ వసంతానికి చేరుకోవడంతో సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. 'భారతీయ నాగరికత అజేయ సంకల్పం, బలానికి గొప్ప నిదర్శనం సోమనాథ్ ఆలయం పునర్నిర్మాణం. మన ఆధ్యాత్మిక సంప్రదాయానికి శక్తివంతమైన చిహ్నం. సంపూర్ణ విశ్వాసం, ఉత్సుకత, భక్తితో యావద్దేశం స్వాభిమాన్ పర్వ్ ఉత్సవాలను జరుపుకొంటోంది' అని మోదీ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పేర్కొన్నారు.సోమనాథ్ ఉత్సవాల్లో భాగంగా జనవరి 11వ తేదీ ఉదయం 9.45 గంటలకు జరిగే శౌర్యయాత్రలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొనున్నారు. సోమనాథ్ ఆలయాన్ని శతాబ్దాలుగా కాపాడుకుంటున్న యోధుల సంస్మరణగా ఈ శౌర్యయాత్ర నిర్వహిస్తున్నారు. ధైర్యం, త్యాగం, శౌర్యానికి ప్రతీకలుగా 108 అశ్వాలు ఈ యాత్రలో పాల్గొంటాయి. సాయంత్రం జరిగే ఓంకార మంత్రోచ్ఛరణ కార్యక్రమంలోనూ ప్రధాని పాల్గొంటారు. ఆలయ చరిత్ర, భారతదేశ సమున్నత ఆధ్యాత్మిక విలువలపై జరిగే పబ్లిక్ ప్రోగ్రాంలో ఆయన ప్రసంగిస్తారు.

# తెలంగాణలోని ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేయండి

(మొదటి పేజి తరువాయి)

ఒక దేశం కేంద్ర-రాష్ట్రాల సమన్వయం ద్వారానే పురోగమిస్తుంది. కేంద్ర బ్జడెట్ తయారీలో రాష్ట్రాలను భాగస్వామ్యం చేయడం ముఖ్యమైన చొరవ. ఇది సహకార సమాఖ్య స్ఫూర్తిని బలోపేతం చేస్తుంది. అభివృద్ధి చెందిన భారతదేశం లక్ష్యాన్ని సాధించడంలో సహాయపడుతుందని నమ్ముతున్నానని భట్టి అన్నారు. 2047 నాటికి దేశాన్ని 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే భారత ప్రభుత్వ లక్ష్యాన్ని అభినందిస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం దేశ జీడీపీలో తెలంగాణ వాటా 5.1 శాతం. మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మేము తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను ఆవిష్కరించాము. దీని ద్వారా తెలంగాణను ప్రస్తుతం ఉన్న 200 బిలియన్ డాలర్ల నుండి 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలని ప్రయత్నిస్తున్నాం. తద్వారా దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాము. మౌలిక సదుపాయాల కల్పన కోసం తెలంగాణలో పెట్టుబడి రేటును ప్రస్తుత 37 శాతం నుంచి 50 శాతానికి పెంచాల్సి ఉంది. రాష్ట్రాల ద్రవ్య లోటు పరిమితిని ఏడాదికి కనీసం 4 శాతానికి పెంచాలి.రాష్ట్రాలకు ఇస్తున్న 50 ఏళ్ల వడ్డీ లేని రుణాలను గ్రాంట్లుగా మార్చాలని, ఆ సహాయాన్ని రెట్టింపు చేయాలని కోరుతున్నాము. విద్య, ఆరోగ్య రంగాల కోసం సేకరించే వనరులను ఎఫ్‌బిఆర్ఎం పరిమితుల నుంచి మినహాయించాలి. తెలంగాణలో ప్రస్తుతం 1000కి పైగా కులాల వారీగా రెసిడెన్షియల్ పాఠశాలలు ఉన్నాయి. మా ప్రభుత్వం 119 నియోజకవర్గాల్లో ఆధునిక వసతులతో కూడిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తోంది. ఇక్కడ అన్ని వర్గాల పిల్లలు కలిసి చదువుకుంటారు. అనేక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, మెడికల్ కాలేజీలను కూడా ఏర్పాటు చేస్తున్నాము. కేంద్రం తన మొత్తం వ్యయంలో 20 శాతం కంటే ఎక్కువ రాష్ట్ర, ఉమ్మడి జాబితా అంశాలపై ఖర్చు చేస్తోంది. ఇందులో 25 శాతం తగ్గించి, ఆ రూ.2.21 లక్షల కోట్లను నేరుగా రాష్ట్రాలకు బదిలీ చేయాలని సూచిస్తున్నాము. ప్రస్తుతం సెస్‌లు, సర్‌ఛార్జీల వాటా కేంద్ర పన్ను రాబడిలో 20 శాతానికి చేరింది. దీని వల్ల 15వ ఆర్థిక సంఘం 41 శాతం పన్ను బదిలీని సిఫార్సు చేసినప్పటికీ.. రాష్ట్రాలకు కేవలం 30 శాతం మాత్రమే అందుతోంది. దాదాపు రూ1,55,000 కోట్ల సర్ ఛార్జీలను మౌలిక సదుపాయాల నిధికి మళ్లించాలి. లేదా వాటిని ప్రాథమిక పన్ను రేట్లలో కలిపి రాష్ట్రాలకు వాటా ఇవ్వాలి. తెలంగాణలో ప్రాంతీయ రింగ్ రోడ్ ప్రాజెక్టును తక్షణమే మంజూరు చేయాలని కోరుతున్నాము. హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2: దీనికి సంబంధించి త్వరగా నిర్ణయం తీసుకుని అనుమతులు ఇవ్వాలి. హైదరాబాద్‌లో ఐఐఎంఏర్పాటును ప్రకటించాలి. మిగిలిన జిల్లాల్లో కేంద్రీయ, జవహర్ నవోదయ విద్యాలయాలను ఏర్పాటు చేయాలి. పెద్దపల్లి, వరంగల్, ఆదిలాబాద్, కొత్తగూడెంలో విమానాశ్రయాలను మంజూరు చేయాలి.పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించాలి. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కోసం రూ14,100 కోట్లు, రేడియల్ రోడ్ల కోసం రూ45,000 కోట్లు, హైదరాబాద్ మురుగునీటి పారుదల ప్రణాళిక కోసం రూ17,212 కోట్లు కేటాయించాలన్నారు. సహకార సమాఖ్య స్ఫూర్తితో మా అభ్యర్థనలను సానుకూలంగా పరిశీలిస్తారని ఆశిస్తున్నాము.. అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

-----

# హెచ్-1 వీసా ప్రాసెసింగ్ ఫీజులు పెంపు

(మొదటి పేజి తరువాయి)

2,805 డాలర్లుగా ఉన్న ప్రీమియం ఫీజు ప్రస్తుతం 2,965కి పెరిగింది. విదేశీ ఉద్యోగుల వీసా దరఖాస్తు పరిశీలనను వేగవంతం చేసేందుకు అమెరికా సంస్థలు ఈ ఫీజును చెల్లిస్తుంటాయి. ఇక ఎఫ్-1, జే-1వంటి వీసాల ప్రీమియం ఫీజు కూడా 1,965 డాలర్ల నుంచి 2,075 డాలర్లకు పెరిగింది. 2023 జూన్ నుంచి 2025 జూన్ మధ్య కాలంలో పెరిగిన ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రీమియం ప్రాసెసింగ్ ఫీజును పెంచినట్టు పౌరసత్వ, వలస సేవల శాఖ పేర్కొంది. జాబ్స్ మారే వారు, వీసాలను రెన్యూవల్ చేసుకునే విదేశస్తులపై ఈ పెంపు భారం పడనుంది. ఫీజు పెంపుతో వచ్చే అదనపు నిధులతో తమ కార్యకలాపాలను మరింత సరళతరం చేసేందుకు వినియోగిస్తామని ప్రభుత్వం తెలిపింది. వీసా దరఖాస్తుల బ్యాక్‌లాగ్స్ తగ్గడంతో పాటు వీసా దరఖాస్తుల పరిశీలన ఇతర సేవలు మరింత వేగవంతం అవుతాయని చెప్పింది. వీసా సేవలకు పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా ధరలు సరిదిద్దడమే తమ లక్ష్యమని కూడా వెల్లడించింది. వలసల కట్టడికి ఇప్పటికే అమెరికా ప్రభుత్వం వివిధ మార్గాలను అనుసరిస్తున్న నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. వీసా నిబంధనలు ఉల్లంఘిస్తే చిక్కులు తప్పవని ఇటీవల భారతీయ ఎంబసీ ఎక్స్ వేదికగా హెచ్చరించిన విషయం తెలిసిందే.

## ఎమ్మార్పీఎస్ పిలుపు మేరకు 21న మాదిగ సర్పంచుల సన్మాన మహోత్సవం




**హనుమకొండ బ్యూరో/ధర్మసాగర్ జనవరి10 (జర్నలిస్ట్ వార్త):**
ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపన్న పిలుపు మేరకు ఈ నెల 21న హైదరాబాద్ ఉప్పల్ భగత్ శిల్పారామంలో మాదిగ సర్పంచుల సన్మాన మహోత్సవ సభ నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు తెలిపారు. ఈ సభకు తెలంగాణ వ్యాప్తంగా మాదిగ సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు హాజరై ఘనంగా సన్మానం పొందాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని వివిధ గ్రామాల నుంచి ఎన్నికైన మాదిగ సర్పంచులు, ఉపసర్పంచులకు సన్మాన సభకు హాజరు కావాలని ఆహ్వాన పత్రికలు పంపిణీ చేశారు. ధర్మసాగర్ గ్రామ సర్పంచ్ మాచర్ల జ్యోతి, రాపాకపల్లి సర్పంచ్ కందుకూరి జాకోబ్, ఉపసర్పంచ్, సాయిపేట గ్రామ సర్పంచ్ లక్ష్మి, కేశవనగర్ గంగారపు జయ, కేతంపల్లి సర్పంచ్ గంగారపు బాలస్వామి, కర్ణపురం సర్పంచ్ గుర్రపు రీనా ప్రవీణ్, ఉపసర్పంచ్ అంకారపు అనిల్ కుమార్, రాయిగూడెం సర్పంచ్ మహేష్‌లకు ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ సన్మాన మహోత్సవానికి ముఖ్య అతిథులుగా ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క హాజరుకానున్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పోలమారి బాలస్వామి, హనుమకొండ జిల్లా అధికార ప్రతినిధి కొడవటి తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి గంగారపు యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు. మాదిగ సర్పంచులు, ఉపసర్పంచులు ఈ సభకు హాజరై ఘనంగా సన్మానం పొందాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

# మంత్రాలతో డబ్బు రెట్టింపు కాదు

## మోసగాళ్ల జేబులు మాత్రమే నిండుతాయి.

### మూఢనమ్మకాల ఉచ్చు -- మోసాల మాయలో చిక్కుకుంటున్న అమాయకులు

(జిల్లా ప్రత్యేక కథనం)

**హనుమకొండ బ్యూరో ధర్మసాగర్10 (జర్నలిస్ట్ వార్త):**
మంత్రాలు, తంత్రాలు, పూజలు చేస్తే డబ్బు రెట్టింపు అవుతాయని, దరిద్రం తొలగిపోతుందని, కుటుంబ సమస్యలు మాయమవుతాయని చెప్పే బాబాల మాటలకు ఇప్పటికీ అనేక మంది అమాయక ప్రజలు మోసపోతున్నారు. శాస్త్రీయ ఆలోచనకు దూరంగా మూఢనమ్మకాలపై ఆధారపడటంతో లక్షల రూపాయలు పోగొట్టుకుని చివరకు బాధితులుగా మారుతున్నారుఇటీవల హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని ఓ గ్రామంలో చోటు చేసుకున్న ఘటన ఈ వాస్తవాన్ని మరోసారి బట్టబయలు చేసింది. మంత్రాలతో పూజలు చేస్తే డబ్బులు రెట్టింపు అవుతాయని నమ్మబలికి కొందరు బాబాలు ప్రజల నుంచి లక్షల రూపాయలు వసూలు చేసి స్వాహా చేసినట్లు పోలీసులు గుర్తించారు. అమాయకుల విశ్వాసాన్ని ఆసరాగా చేసుకునిమోసాలకు పాల్పడిన నిందితులను ఒక్కొక్కరిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మూఢనమ్మకాల ముసుగులో జరుగుతున్న ఈ తరహా మోసాలు కేవలం ఆర్థిక నష్టానికే పరిమితం కావడం లేదు. కుటుంబాల్లో కలహాలు, అప్పుల భారం, మానసిక వేదనలు వంటి తీవ్రమైన సమస్యలకు దారి తీస్తున్నాయి. చదువు, విజ్ఞానం పెరిగిన ఈ కాలంలో కూడా ఇలాంటి మోసాలకు ప్రజలు బలి కావడం ఆందోళన కలిగించే అంశంగా మారింది. ఈ నేపథ్యంలో హనుమకొండ జిల్లా పోలీసులు ప్రజలకు స్పష్టమైన



హెచ్చరికలు జారీ చేస్తున్నారు. "మంత్రాలు, తంత్రాలు, పూజలతో డబ్బులు పెరుగుతాయన్నది పూర్తిగా అవాస్తవం. ఇలాంటి మాటలను నమ్మి ఎవరికీ డబ్బులు ఇవ్వవద్దు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి" అని సూచిస్తున్నారు. అసలు సమస్య ఎక్కడ ఉంది అనే ప్రశ్నను సమాజం మొత్తం ఆలోచించాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. విద్యా లోపం, అవగాహన లేకపోవడం, త్వరగా ధనవంతులు కావాలన్న ఆశ, సమస్యలకు సులభ పరిష్కారం కోరుకోవడం వంటి అంశాలు మూఢనమ్మకాల పెరుగుదలకు కారణమవుతున్నాయి. ఈ పరిస్థితిని మార్చాలంటే కుటుంబ స్థాయి నుంచి సమాజ స్థాయి వరకు అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం, విద్యా సంస్థలు, సామాజిక సంఘాలు కలిసి మూఢనమ్మకాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. శాస్త్రీయ దృక్పథన్ని పెంపొందించే కార్యక్రమాలు చేపట్టాలి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన సదస్సులు, చర్చలు నిర్వహించడం ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తమవుతోంది. మూఢనమ్మకాలు అభివృద్ధికి అడ్డంకి మాత్రమే కాదు, మోసగాళ్లకు ఆయుధంగా మారుతున్నాయి. కష్టపడి సంపాదించిన డబ్బును పూజల పేరుతో కోల్పోవడం కన్నా, శ్రమపై నమ్మకం పెట్టుకోవడం, చట్టబద్ధమైన మార్గాల్లో సమస్యలకు పరిష్కారం వెతకడమే మేలైన మార్గం. అందుకే ప్రతి ఒక్కరూ ఒక విషయం గుర్తుంచుకోవాలి --మంత్రాలతో డబ్బు రెట్టింపు కాదు, మోసగాళ్ల జేబులు మాత్రమే నిండుతాయి. మూఢనమ్మకాలకు దూరంగా ఉండి, విజ్ఞానం, అవగాహనతో ముందుకు సాగితేనే సమాజం సురక్షతంగా, అభివృద్ధి పథంలో నడుస్తుంది.

# ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరం

**గార్ల/జనవరి10(జర్నలిస్ట్ వార్త):**
గార్ల మండలం శేరిపురం గ్రామంలో జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా స్థానిక పశు వైద్యాధికారి డాక్టర్ వి. సురేష్‌కుమార్ (వి ఏ యస్ గార్ల) హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్ గూగులోతు భారతి కిషన్, ఉపసర్పంచ్ కారం రమేష్‌లను శాలువాలతో సత్కరించారు. డాక్టర్ సురేష్‌కుమార్ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఇంట్లో పాడి పశువులు ఉంటే కల్తీ లేని పాలు లభిస్తాయని, రోజూ పాలు తాగడం ఆరోగ్యానికి మేలు చేస్తుందన్నారు. కేవలం ఆడ దూడలు పుట్టే విధంగా రూపొందించిన సదుపాయాలు గోపాల మిత్రుల వద్ద అందుబాటులో ఉన్నాయని తెలిపారు. దూడ పుట్టిన 24 గంటల లోపల టీటీ ఇంజెక్షన్ వేయించుకోవడం ద్వారా ధనుర్వాతం నివారించవచ్చని సూచించారు. ఎద లక్షణాలను సకాలంలో గుర్తించి సరైన సమయంలో



కృత్రిమ గర్భధారణ చేయించుకోవాలని రైతులకు సూచించారు. ఆవులలో ఎదకాలం 24 గంటలు, గేదెలలో 36 గంటలు ఉంటాయని, ఆవులు ఉదయం ఎదకు వస్తే సాయంత్రం, గేదెలు ఉదయం ఎదకు వస్తే మరుసటి రోజు ఉదయం కృత్రిమ గర్భధారణ చేయించాలని తెలిపారు. ఈ శిబిరంలో గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, వెటర్నరీ అసిస్టెంట్ శేఖర్, గోపాలమిత్ర సూపర్వైజర్ ముజ్జిగ అనిల్‌రావు, గోపాలమిత్రులు లక్ష్మణ్,



సంజీవరావు, నాగేశ్వరరావు, రవి తదితరులు పాల్గొన్నారు. గ్రామ పాడి రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. శిబిరంలో మొత్తం 42 పశువులకు చికిత్స అందించారు. ఇందులో ఎదకు రాని పశువులు 19, దూడలకు నట్టల నివారణ మందులు 25, గర్భకోశ వ్యాధుల చికిత్స 9, సాధారణ చికిత్స 13 పశువులకు చేశారు. చికిత్స పొందిన పశువులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

## వర్ధన్నపేటలో మూడో రోజుకు రిలే నిరాహార దీక్షలు

### జ్యోతీబావు పూలే సంఘం మద్దతు

### పాత ఆస్పత్రి స్థలంలోనే 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి డిమాండ్



**వర్ధన్నపేట /జనవరి10 (జర్నలిస్ట్ వార్త):**జీఓ నెం. 445 (2025 జూన్) ప్రకారం వర్ధన్నపేటలోని పాత ఆస్పత్రి స్థలంలోనే 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ వర్ధన్నపేట సాధనా సమితి చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మూడో రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలకు జ్యోతీబావు పూలే సంఘం మద్దతు, సంఘీభావం తెలిపింది. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ప్రజల అవసరాలను పక్కన పెట్టి నిర్ణయాలు మార్చుకోవడం సరికాదని సంఘం సభ్యులు అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వమే 2025 జూన్ 11న వర్ధన్నపేటలో 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి టెండర్ నోటీసు జారీ చేసిందని గుర్తు చేసిన వారు, ఆ టెండర్ ప్రకారం ఇప్పటివరకు చర్యలు ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. ప్రజల ఆకాంక్షలను గౌరవించి పాత ఆస్పత్రి స్థలంలోనే ఆస్పత్రి నిర్మాణాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా, వర్ధన్నపేటలో 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి స్థల సేకరణ పూర్తైందంటూ కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ప్రచారాన్ని వర్ధన్నపేట సాధనా సమితి ఖండించింది. స్థల సేకరణ పూర్తైనట్లుగా ఎమ్మెల్యే నాగరాజు అధికారికంగా ఎక్కడా ప్రకటించలేదని, ప్రధాన పత్రికల్లో కూడా ఎలాంటి వార్త ప్రచురితం కాలేదని స్పష్టం చేసింది. అసత్య ప్రచారం ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని కాంగ్రెస్ నాయకులపై మండిపడ్డ సాధనా సమితి, ప్రభుత్వమే జారీ చేసిన టెండర్ ప్రకారం ఆస్పత్రి నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని డిమాండ్ చేసింది.

# జన్ను థమస్ స్మారక ఒకరోజు క్రికెట్ పోటీలు ఘనంగా ముగింపు

**కోమటిపల్లి క్రీడా మైదానంలో క్రీడోత్సవం**

**ధర్మసాగర్ జట్టుకు తొలి బహుమతి**

**-- రూ.10 వేల నగదు, కప్పు**

**ద్వితీయ బహుమతి జన్ను మార్టిన్ జట్టు సొంతం**



**హనుమకొండ బ్యూరో ధర్మసాగర్ / 10జనవరి(జర్నలిస్ట్ వార్త):**
జన్ను థమస్ స్మారక మూడవ వర్ధంతిని పురస్కరించుకుని కోమటిపల్లి క్రీడా మైదానంలో నిర్వహించిన ఒకరోజు క్రికెట్ పోటీలు క్రీడాభిమానుల ఉత్సాహం మధ్య ఘనంగా ముగిశాయి. ఈ పోటీలలో నాలుగు జట్లు పాల్గొని ఉత్కంఠభరితమైన పోరాటాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. తుదిపోరులో ధర్మసాగర్ పుట్ట ప్రశాంత్ నాయకత్వంలోని ధర్మసాగర్ జట్టు ప్రత్యర్థులను మట్టికరిపించి విజేతగా నిలిచింది. విజేత జట్టుకు రూ.10 వేల నగదు బహుమతి మరియు ఆకర్షణీయమైన కప్పును ధర్మసాగర్ గ్రామ సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలీయా, పుట్ట సుధాకర్ చేతుల మీదుగా అందజేశారు. జన్ను మార్టిన్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచి ప్రశంసలు అందుకుంది.
ఈ సందర్భంగా మాట్లాడిన అతిథులు జన్ను థమస్ చేసిన సేవలను స్మరించుకుంటూ, గ్రామీణ యువతను క్రీడల వైపు ప్రోత్సహించడంలో ఇలాంటి పోటీలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. క్రీడల ద్వారా శారీరక ఆరోగ్యం, క్రమశిక్షణ, సమైక్యత పెంపొందుతాయని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో ధర్మసాగర్ గ్రామ సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలీయా, పుట్ట సుధాకర్, రాష్ట్ర ఎంఆర్పీఎస్ నాయకులు గంగారపు శ్రీనివాస్, పుట్ట ప్రదీప్ కుమార్, పుట్ట ప్రశాంత్, బొడ్డు ప్రభుదేవ్, పుట్ట చైతన్య, గబ్బేట ఆగస్టిన్, మోరపల్లి రఘుపతి రెడ్డి, మనోజ్, బొడ్డు క్రాంతి, రాణదేవ్, గబ్బేట సందీప్, నక్క సిద్దు తదితర ప్రజాప్రతినిధులు, యువ నాయకులు, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతంలో క్రీడాస్ఫూర్తిని చాటిచెప్పేలా ఈ పోటీలు విజయవంతంగా నిర్వహించబడినట్లు నిర్వాహకులు తెలిపారు



## రోడ్డు భద్రత నియమాలు పాటించాలి: వంగర ఎస్ఐ దివ్య

### హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించిన వాహనదారులకు గులాబీలతో సత్కారం



**భీమదేవరపల్లి/జనవరి10 (జర్నలిస్ట్ వార్త):**
హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర పోలీస్ స్టేషన్ పరిధిలో జాతీయ రోడ్డు భద్రతా మాసం సందర్భంగా శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని గాంధీనగర్ గ్రామం ముల్కనూర్ హుజురాబాద్ రహదారిపై హెల్మెట్, సీట్ బెల్టులు ధరించిన వాహనదారులను ఎస్ఐ దివ్య గులాబీ పువ్వులు అందించి సత్కరించారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రతా అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరి పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ హెడ్ కానిస్టేబుల్ యాదగిరి, సిబ్బంది పాల్గొన్నారు.



# గ్రామాభివృద్ధి చేసే వారిపై అసత్య ఆరోపణలు సరికాదు

**రాయపర్తి/జనవరి 10(జర్నలిస్ట్ వార్త):ఎ**
మండలంలోని గన్నారం గ్రామంలో ఎన్నో సంవత్సరాలుగా స్వచ్ఛందంగా అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి స్వంత నిధులతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్న జెన్నపురెడ్డి శ్రీరామ్ రెడ్డి పై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని గన్నారం గ్రామస్తులు అన్నారు. గ్రామానికి తరతరాలుగా సేవలను అందిస్తున్న జెన్నపురెడ్డి శ్రీరామ్ రెడ్డి వారి కుటుంబ సభ్యులు వారి తాతలు, వారి నాన్న గతంలో గ్రామానికి బాటకు భూమిని కొనిచ్చారని, కోట్ల రూపాయల ఖర్చుతో గ్రామంలో గుడిని, అంబేద్కర్ విగ్రహాన్ని, బతుకమ్మ విగ్రహాన్ని నిర్మించడంతో పాటు గ్రామంలోని ఎస్ సి కాలనీ ప్రజలకు ఉచితంగా ట్యూబ్ లైట్లు అందించాడని, పాఠశాల విద్యార్థులకు ఉచితంగా యూనిఫాంసు బెల్ట్ షూస్ అందించి పాఠశాల అభివృద్ధికి 70 లక్షల రూపాయలు




వెచ్చించి నిర్మాణాలు చేస్తున్న క్రమంలో కొన్ని చెట్లు తొలగించడంతో గ్రామంలో కొంత మంది అభివృద్ధి విరోధకులు అమ్ముకున్నారని జెన్నపూరెడ్డి శ్రీరామ్ రెడ్డి పై అసత్య ఆరోపణలు చేస్తూ పాఠశాల అభివృద్ధిని అడ్డుకుంటున్నారని అన్నారు. ఆ చెట్లను పాఠశాలకు దర్వాజలుగా, కిటికీల తయారీకి వినియోగించే విధంగా స్కూల్లోనే భద్రపరచామని,దమ్ముంటే ఆరోపణలు నిరూపించాలని స్వచ్ఛందంగా గ్రామాభివృద్ధికి సహకరిస్తున్న వ్యక్తిపై రాజకీయ బురద చల్లడం సరికాదని గ్రామస్తులు అన్నారు. ఈ కార్యక్రమంలో గన్నారం గ్రామ సర్పంచ్.. గడ్డం విజయ -సమ్మయ్య.. మాజీ సర్పంచులు.. కుక్కల భాస్కర్, బెల్లి పెద్దాపురం.. ఉప -సర్పంచ్ కల్మీకొండ బొంద్యాలు, గ్రామ ప్రజలు ఉల్లెంగల సుధాకర్, మండల రాజు. నాగయ్య, గేజేందర్ రెడ్డి,చెల్లోజు రమేష్, నందనబోయిన సాంబాశివా,గడ్డం సునీల్, యాదయ్య, పాపయ్య, నర్సయ్య, ప్రభాకర్, ప్రవీణ్, వంశీ, బద్రి, శ్రీకాంత్, బషీరుద్దీన్, వెంకటయ్య, యాకయ్య, పిచ్చయ్య, సుధాకర్, కర్ణాకర్, మహేష్, ప్రభాకర్ రెడ్డి, సోమయ్య, శ్రీను, రాజు, ఐలయ్య,నాగరాజు,నితిన్, తేజ.. గ్రామ మహిళలు.. తదితరులు పాల్గొన్నారు.

## మృతదేహం లభించిన స్థలాన్ని పరిశీలించిన డిసిపి

**భీమదేవరపల్లి/జనవరి10 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామ శివారులో రెండు రోజుల క్రితం గుర్తుతెలియని మగ వ్యక్తి మృతదేహం స్థానికంగా కలకలం రేపిన విషయం తెలిసిందే. కాగా ఘటన స్థలాన్ని వరంగల్ సెంట్రల్ జోన్ డిసిపి కవిత, ముల్కనూర్ ఎస్ఐ రాజు శనివారం పరిశీలించారు. సుమారు 30 నుంచి 40 సంవత్సరాల వయసు గల శవం సమ్మక్క గుట్టవద్ద పడివుండగా పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. దర్యాప్తులో భాగంగా ఘటన స్థలం పరిశీలించిన డిసిపి స్థానిక ఎస్ఐ రాజుకు పలు సూచనలు చేశారు. మృతదేహం ఎడమవైపు ఛాతీపై ఇంగ్లీషు అక్షరాలలో అమ్మ అనే పచ్చబొట్టు కలిగి ఉండగా కేసును చేదించేందుకు పోలీసులు పలు రకాలుగా ముమ్మర దర్యాప్తు చేస్తున్నారు. బాగా కుళ్ళిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు.



# ముందస్తు సంక్రాంతి సంబరాలు



**రాయపర్తి/జనవరి 10(జర్నలిస్ట్ వార్త);**మండలంలోని కాట్రపల్లి గ్రామంలోని సెయింట్ మేరీస్ హైస్కూల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థుల తల్లులకు,విద్యార్థులకు ముగ్గుల పోటీ నిర్వహించడం జరిగింది. మొదటి బహుమతి మొరిపిరాల గ్రామానికి చెందిన ప్రవళిక,రెండో బహుమతి కాట్రపల్లి గ్రామానికి చెందిన అనూష,మూడో బహుమతి కాట్రపల్లి గ్రామానికి చెందిన స్రవంతి గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో పిల్లలు వివిధ వేషాలతో ఆటపాటలతో భోగిమంటలతో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు కే సోమన్న,పాఠశాల కరస్పాండెంట్ శిబూ పాల్ విద్యార్థులకు తల్లిదండ్రులకు ముందస్తుగా సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు కే వెంకట్ రెడ్డి పి రవీనా రాజ్ ఆర్ సుధాకర్ అకాడమిక్ కోఆర్డినేటర్ కె ప్రవీణ్ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు ఎం హరిబాబు జి ప్రసాద్ ఎం దుర్గాప్రసాద్ రమేష్ ఎం మోతిలాల్ సరిత సుజాత సరస్వతి రిజ్వాన అశ్విని రవళి స్వాతి తదితరులు పాల్గొన్నారు.

# సత్తుపల్లి మున్సిపల్ ఎలక్షన్ లో కాషాయ జండా ఎగరవేస్తాం..

## గుత్తా వెంకటేశ్వరరావు. బీజేపి జిల్లా ప్రధాన కార్యదర్శి మరియు సత్తుపల్లి నియోజకవర్గ ఇన్చార్జ్.

**సత్తుపల్లి/జనవరి10(జర్నలిస్ట్ వార్త):**
ఈరోజు భారతీయ జనతా పార్టీ సత్తుపల్లి నియోజకవర్గ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు బాణావత్ విజయ్ అధ్యక్షతన సత్తుపల్లి మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం జరిగింది.

ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మరియు సత్తుపల్లి నియోజకవర్గ ఇన్చార్జి గుత్తా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, మొన్న జరిగిన పంచాయితీ ఎన్నికలలో రాష్ట్రంలో బిజెపి వందలాది సర్పంచులను, అత్యధిసంఖ్యలో వార్డు మెంబర్లను కైవసం చేసుకుందన్నారు. అదేవిధంగా రానున్న మున్సిపల్ ఎలక్షన్ లో మున్సిపాలిటీలను గెలవబోతుందన్నారు. సత్తుపల్లి మున్సిపల్ ఎలక్షన్ లో కూడా కాషాయ జెండా ఎగరటం ఖాయమని, ,

ప్రజలు బిజెపికి ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారని, కాబట్టి బిజెపి శ్రేణులు ఆ దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సత్తుపల్లి మున్సిపాలిటీ సమస్యలపై నిరంతరంగా బిజెపి పోరాటం చేసిందని, సింగరేణి బాంబు పేలుళ్ల ప్రభావంతో ఇళ్ళు దెబ్బతిన్న బాధితుల తరఫున అలుపెరగని పోరాటం చేయడం జరిగిందని,



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ప్రభుత్వ హాస్పటల్ ప్రారంభించమని ధర్నా చేస్తే అధికార పార్టీ నాయకుల ప్రోద్భలం తో బిజెపి నాయకులు పై అక్రమ కేసులు బనాయించడం జరిగిందని, అదేవిధంగా పారిశుధ్యం గురించి, తాగునీటి సమస్య గురించి నిరంతరం బిజెపి అనేక ఉద్యమాలు చేయటం జరిగిందన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం సత్తుపల్లి మున్సిపాలిటీకి వందల కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని, కేవలం కేంద్రం ఇచ్చిన డబ్బులతోనే మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులు నడుస్తున్నాయన్నారు. కాబట్టి సత్తుపల్లి మున్సిపాలిటీ ఓటర్లు బిజెపి అభ్యర్థులకు



ఓటు వేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు నంబూరి రామలింగేశ్వర రావు, ఇవి రమేష్ , జిల్లా ప్రధాన కార్యదర్శి నాయుడు రాఘవరావు, జిల్లా ఉపాధ్యక్షులు సుదర్శన్ మిశ్రా, భాస్కర్ల వీరంరాజు, జిల్లా కార్యదర్శి సురేందర్ రెడ్డి ,జిల్లా కౌన్సిల్ మెంబర్ పర్సా రాంబాబు, జిల్లా నాయకులు పడగల మధుసూదన్ రావు, సీనియర్ నాయకులు జిల్లా కౌన్సిల్ సభ్యులు షేక్ రహమతుల్లా, మన్నెం నరసింహా మూర్తి, మాజీ మండల అధ్యక్షులు పాలకొల్లు శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి మంద శివ, కార్తీక్ , చీకటి వసంతరావు, సాయి, సందీప్ ,మెరుగు శేషగిరి రావు తదితరులు పాల్గొన్నారు.

# కమణీయం.. వీరభద్రుని కళ్యాణం

## ముక్కోటి దేవతలు దిగివచ్చిన వేళ -వైభవపేతంగా భద్రకాళి సమేత వీరభద్ర స్వామి కళ్యాణోత్సవం





**భీమదేవరపల్లి/జనవరి10 (జర్నలిస్ట్ వార్త):**
ఉత్తర తెలంగాణలో ప్రసిద్ధి చెందిన కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి జాతర బ్రహ్మోత్సవాలు శనివారం కన్నుల పండుగగా ప్రారంభమయ్యాయి, భద్రకాళి సమేత వీరభద్ర స్వామి కళ్యాణోత్సవం సాయంత్రం అత్యంత వైభవంగా జరిగింది. వీరభద్ర స్వామి కళ్యాణోత్సవం సందర్భంగా ఆలయంలో ఉదయం అంకురార్పణ ఘట్టం వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ నిర్వహించారు. నందీశ్వరును చిత్రపటంతో ధ్వజారోహణం చేసి ముక్కోటి దేవతలను స్వాగతం పలికారు. సాయంత్రం నిర్వహించిన భద్రకాళి సమేత వీరభద్ర స్వామి కళ్యాణోత్సవంలో జాతర బ్రహ్మోత్సవాల కమిటీ చైర్మన్ బొజ్జపురి అశోక్ ముఖర్జీ ఆలయ ఈవో కిషన్ రావు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరగగా పెద్ద సంఖ్యలో భక్తజనం హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామాల సునీత, 'కుడా' చైర్మన్, డిసిసి అధ్యక్షులు ఇనుగాల వెంకటరామిరెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జనపరెడ్డి సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు చిట్టెంపల్లి ఐలయ్య, కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షులు ఊసకోయిల ప్రకాష్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# చలి మంటలతో వాతావరణ కాలుష్యం

**-చలి మంటలు వద్దు మందపు దుస్తులు ధరించడమే ముద్దు.**

**- పర్యావరణ ఉద్యమ కారులు రావుల భాస్కర్ రావు.**

**రాయపర్తి/జనవరి 10(జర్నలిస్ట్ వార్త);**
చలి మంటలతో వాతావరణం కాలుష్యం అవుతుందని పర్యావరణ ఉద్యమ కారులు రావుల భాస్కర్ రావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో చలిపులి విపరీతంగా పెరిగిపోయి ప్రజల అవసరపడుతూ చలిపులిని ఎదుర్కోవడానికి మధ్యస్థంగా చలి మంటలను ఆశ్రయిస్తున్నారని



అన్నారు. చలిమంటల కాగడం వల్ల అనేక రకాల అనారోగ్య పరిస్థితులు ప్రమాదకరమైనటువంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని ప్రజల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రజలు వరి గడ్డిని వ్యవసాయ పంటల వ్యర్థాలను, ప్లాస్టిక్ కాగితాలను ప్లాస్టిక్ సీసాలను పాత టైర్లను కాలుస్తూ చలి మంటలు కాగుతున్నారని వీటి వల్ల చర్మవ్యాధులు, అస్తమా లాంటి ఊపిరితిత్తుల వ్యాధులు వ్యాపిస్తాయని,చర్మంలో ఉన్నటువంటి సహజ సిద్ధమైన నూనెలు కొవ్వులు డ్రై స్కిన్ లాంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని అన్నారు. విషపూరిత వాయువులను పీల్చడం ద్వారా ఊపిరితిత్తుల వ్యాధులు అంతుచిక్కనివి వచ్చే అవకాశం ఉందని క్యాన్సర్ బారిన పాడే అవకాశం ఉందని తెలిపారు. చలి మంటలు వద్దని ప్రజలు మంద్దపు దుస్తులు ధరించాలని కోరారు.

# పెద్దమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి సహకారం

**భీమదేవరపల్లి సర్పంచ్ మాచర్ల కుమారస్వామి**

**భీమదేవరపల్లి/జనవరి10 (జర్నలిస్ట్ వార్త):**
హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల కేంద్రంలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో అభివృద్ధి పనులు సర్పంచ్ మాచర్ల కుమారస్వామి చేపట్టారు. కేంద్ర హోంశాఖ మంత్రి బండి సంజయ్ కుమార్ సహకారంతో ముదిరాజ్ సంఘం ఆరాధ్య దైవం పెద్దమ్మ తల్లి గుడి ఆవరణలో బోరుబావి వేయించినట్లు సర్పంచ్ తెలిపారు. ఆలయ అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా చెప్పారు. ముదిరాజ్ సంఘ నాయకులు వారికి ధన్యవాదాలు తెలిపారు. బోరు బావి ఫుల్ సక్సెస్ కావడంతో ముదిరాజ్ కుల సంఘ పెద్దలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ




కార్యక్రమంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షులు శ్రీరామోజు శ్రీనివాస్, బిజెపి సీనియర్ నాయకులు దొంగల కొమురయ్య, ఉపసర్పంచ్ శనిగరపు ఐలయ్య,



వార్డు సభ్యులు లలిత, బొల్లంపల్లి శ్యామ్, వెంకటేశ్వర్లు, సాతురి విజయ, ముదిరాజ్ సంఘం పెద్దలు తదితరులు పాల్గొన్నారు

# నూతన క్యాలెండర్ ను ఆవిష్కరించిన ఎస్ఐ



**రాయపర్తి/జనవరి 10(జర్నలిస్ట్ వార్త):** మండల కేంద్రంలోని ఐకేపీ సెంటర్ లో శ్రీ వెంకటరమణ ఏజెన్సీ 2026 నూతన క్యాలెండర్,డైరీ ను శనివారం స్థానిక ఎస్ఐ ముత్యం రాజేందర్,సర్పంచ్ గారే సహేంద్రబిక్షపతి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ వెంకటరమణ ఏజెన్సీ నిర్వాహకుడు ఉల్లెంగుల వెంకట్, గారే శ్రీనివాస్,ఐత మల్లేష్ , తదితరులు పాల్గొన్నారు.

# సమ్మక్క సారలమ్మ వనదేవతల జాతరలను ఘనంగా నిర్వహించాలి

## -స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి - హాజరైన ఎంపీ డాక్టర్ కడియం కావ్య, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష





**స్టేషన్ ఘన్ పూర్/జనవరి10 (జర్నలిస్ట్ వార్త ) :**
స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలో సమ్మక్క సారలమ్మ జాతరలను భక్తులకు ఎలాంటి ఇబ్బందులులేకుండా విజయవంతంగా నిర్వహించాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య,మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. స్టేషన్ ఘన పూర్ పట్టణ కేంద్రంలోని రైతు వేదికలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలో జరగనున్న మినీ సమ్మక్క సారలమ్మ జాతరల ఏర్పాట్లు, తీసుకోవాల్సిన చర్యలపై వివిధ శాఖల అధికారు లతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జనగామ జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జాతర కమిటీ చైర్మన్లను,సర్పంచులను జాతరలో చేయాల్సినఏర్పాట్లను,తీసుకోవాల్సిన చర్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ నియోజకవర్గంలో 8 ప్రాంతాలలో జరిగే సమ్మక్క సారలమ్మ వనదేవ తలజాతరలను ఘనంగా నిర్వహించాలని అన్నా రు. నియోజకవర్గ పరిధిలో జాతరల నిర్వహణకు 54లక్షలు మంజూరు అయ్యాయని తెలిపారు. ప్రతీ జాతరకు తహసీల్దార్ ఇంచార్జ్ గా విద్యుత్, మిషన్ భగీరథ, పంచాయతీ రాజ్, పోలీస్ శాఖల అధికారులతోపాటు జాతరకమిటీ చైర్మన్లు, సర్పం చులతో కమిటీ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కమిటీ 12తేదీలోపు చేపట్టాల్సిన ఏర్పాట్లపై ప్రతిపాదనలు సిద్ధం చేసి 13వ తేదీన కలెక్టర్ కి అందించాలని సూచించారు. జాతరలో 24 గంట లు విద్యుత్ ఉండేలా చర్యలుతీసుకోవాలని తెలి పారు. జాతర ప్రాంతాలలో పార్కింగ్, ట్రాఫిక్ సమ స్యలు లేకుండా చూడాలని పోలీస్ అధికారులకు సూచించారు. జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాతరలను నిర్వహించాల ని అన్నారు. తహసీల్దార్,ఎంపిడివోలు ఇంచార్జ్ గా కమిటీలు12వతేదీలోగా ప్రతిపాదనలు పంపించా లని సూచించారు. జాతర వద్దకు రోడ్డు ఫార్మేషన్, విద్యుత్, మిషన్ భగీరథ ద్వారా తాగు నీరు, పారిశుధ్యం వంటి వసతులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ, పోలీస్ శాఖలుసమర్థవంతంగా పనిచేయాలని అన్నారు. ఎలాంటి పొరపాట్లకుఅవకాశం లేకుండా జాతరల ను విజయవంతంగా నిర్వహించాలని ఇందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ భక్తుల భద్రత, సౌక ర్యాలే ప్రధాన లక్ష్యంగా మినీ మేడారం జాతర ఏర్పాట్లు కొనసాగాలని అధికారులకు సూచించా రు. జాతర నిర్వహణలో ఎక్కడైనా లోటుపాట్లు ఉన్నట్లయితే వాటిని వెంటనే సరిదిద్దాలని అధికా రులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే జాతర కావడంతో, కేటాయించిననిధులను సమర్థవంతంగా వినియో గించి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రత్యేకంగా శాని టేషన్,త్రాగునీరు,రహదారులు,విద్యుత్ సరఫరా వంటి మౌలిక సదుపాయాలపై పూర్తి స్థాయిలో దృష్టి సారించాలని, వివిధ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి జాతరను విజయ వంతం చేయాలన్నారు.

# మిషన్ భగీరథ పైపు పగుళ్లు

## 10 రోజులు నీటి వృథ-ఫిర్యాదులతోనూ కదలని అధికారులు

**-రజిత చొరవతో తక్షణ పరిష్కారం**



**వైరా/జనవరి 10(జర్నలిస్ట్ వార్త):**
వైరా పట్టణంలో మెయిన్ రోడ్డులో యూనియన్ బ్యాంకు పక్కన సత్యసాయి కిరాణా దుకాణం ఎదుట మిషన్ భగీరథ పైపు పగిలి పది రోజులుగా నీరు వృథగా పోతున్నా మున్సిపాలిటీ అధికారులు పట్టించుకోలేదన్న ఆరోపణలు వినిపించాయి. పలుమార్లు ఫిర్యాదులు చేసినా స్పందన లేకపోవడంతో స్థానికులు అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని కొప్పు రావూరి, సత్యనారాయణ పొనుగుమాటి, నరేంద్రలు గుడిమెట్ల రజిత దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన రజిత సమస్యను మున్సిపాలిటీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా, కమిషనర్ తక్షణమే చర్యలు చేపట్టి మిషన్ భగీరథతో పాటు మున్సిపాలిటీ సిబ్బందిని సంఘటన స్థలానికి పంపించారు. పైపు మరమ్మతులు చేపట్టి నీటి వృథను అరికట్టడంతో సమస్యకు పరిష్కారం లభించింది. సకాలంలో స్పందించి సమస్యను పరిష్కరించిన గుడిమెట్ల రజితకు, మున్సిపాలిటీ కమిషనర్‌కు, సంబంధిత సిబ్బందికి అక్కడి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

# తిరుమల నాద స్వామి దేవాలయంలో ఘనంగా ప్రత్యేక పూజలు





**స్టేషన్ ఘన్ పూర్/జనవరి10 (జర్నలిస్ట్ వార్త):** స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని శ్రీ తిరుమల నాదస్వామిదేవాలయంలో ధనుర్మాసం సందర్భం గా శనివారంతో 26 రోజులు అయిన సందర్భంగా ఆండాళ్ అమ్మవారి పూజలు, స్వామి వారికి ప్రత్యేక పూజలు ఆలయ ప్రధాన అర్చకుడు కల కోట రామానుజచార్యులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూజారి కలకోట రామానుజ చార్యులు, దేవస్థానం చైర్మన్ నీల నర్సింహులు, సులోచన,కొలిపాక సతీష్, సునీత, యద శ్రీనివాస్, తెల్లాకుల రామకృష్ణ, సుష్మ, గట్టు మంజుల, స్వప్న, స్వరూప, పద్మ, గీత,చంద్రకళ,నిర్మల,హేమలత,జ్యోతి,యాదమ్మ, కోమలా,రేణుక,ఉమ,నీలమ్మ, కుంభం నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రెయినేజీని పరిశీలించిన నేషనల్ హైవే ఏఈ మధుసూదన్ రెడ్డి

**స్టేషన్ ఘన్ పూర్/జనవరి10 (జర్నలిస్ట్ వార్త):**




చిల్పూర్ మండలంలోని చిన్నపెండ్యాలలో అసం పూర్తిగా ఉన్న డ్రైనేజీ పనులు పూర్తిచేయాలని ఇటీవల గ్రామ సర్పంచ్ ఇల్లందుల తిరుపతమ్మ ఆదేశాల మేరకు ఆమె సోదరుడు ఇల్లందుల సుదర్శన్ నేషనల్ హైవే అధికారులను కలిసి విన తి పత్రం ఇవ్వడం జరిగింది. ఇల్లందుల సుదర్శన్ వినతి పత్రంతో స్పందించిన నేషనల్ హైవే ఏఈ మధుసూదన్ రెడ్డి ఎన్ హెచ్ పరిశీలన, అసంపూ ర్తి నిర్మాణంలో ఉన్న డ్రెయినేజీని పరిశీలించారు.రోడ్డుకు ఇరువైపుల ఉన్న డ్రెయినేజికి మరమ్మతు లు, నిర్మాణ పనులు పూర్తి చేయించి గ్రామ సమీ పంలో ఉన్న పోలీస్ పటేల్ వాగులోకి వెళ్లేవిధంగా చర్యలు చేపట్టెందుకు ప్రణాళిక రోపోంది దించనై నది. ఈ కార్యక్రమంలో నాయకులు ఇల్లంధుల సుదర్శన్, ఉప సర్పంచ్ తాళ్లపల్లి సంతోష్ కుమా ర్, వార్డు సభ్యులు వేమూనూరి శ్రీనివాస్, రాజు, భూషన్,అరుణ్,గడ్డమీది అశోక్,వినయ్, రాము లు, వెంకటేశ్వర్లు గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి క్వింటాల్ బియ్యం అందజేసిన బిఆర్ఎస్ జిల్లా నాయకుడు అక్కనపెల్లి బాలరాజు



**స్టేషన్ ఘన్ పూర్/జనవరి10 (జర్నలిస్ట్ వార్త) :** గ్రామంలో చనిపోయిన మృతుల కుటుంబాలకు అన్ని విధాల అండగా ఉంటామని బిఆర్ఎస్ జిల్లా నాయకుడు, మాజీ ఎంపీటీసీ అక్కెనపల్లి బాలరాజు అన్నారు. మండలంలోని తాటికొండ గ్రామంలో ఇటీవల మృతి చెందిన నారాబోయిన మల్లేష్ కుటుంబాన్ని బిఆర్ఎస్ జిల్లానాయకుడు, అక్కెనపల్లి బాలరాజు, కాంటెస్టెంట్ సర్పంచ్ అభ్యర్థి మారపాక కవిత మనోహర్ పరామర్శించి క్వింటాల్ బియ్యం అందజేశారు. అదేవిధంగా బొడ్డు కొరమ్మ పార్థివ దేహాన్ని సందర్శించిన జిల్లా నాయకులు మాజీ మార్కెట్ చైర్మన్ అక్కినపల్లి బాలరాజు, బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు పొన్నం శ్రీనివాస్,కాంటెస్టెంట్ సర్పంచ్ అభ్యర్థి మారపాక కవిత మనోహర్ శనివారం పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు నీల మధు శ్రీనివాస్, మారపాక అశోక్, బొల్లం శోభ, పేరబోయిన కుమార్,మారపాక అశోక్, సీనియర్ నాయకులు మేకల మల్లేశం, అక్కనపెల్లి రాజు, మారపాక నాగరాజు తదితరు లు పాల్గొన్నారు.

# సంక్రాంతి పండుగ వేళ మహిళల భద్రతకు పటిష్ట చర్యలు అవసరం

## -ఎస్సై సాయిబాబు

**వర్ధన్నపేట/జనవరి10 (జర్నలిస్ట్ వార్త):**




సంక్రాంతి పండుగ సందర్భంగా మహిళలు, బాలికల భద్రతకు ఎలాంటి లోటు లేకుండా పటిష్ట చర్యలు చేపట్టామని వర్ధన్నపేట పోలీసులు స్పష్టం చేశారు. పండుగ వేళ అసాంఘిక శక్తులు చెలరేగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా మహిళలపై జరిగే వేధింపులు, మోసాలు, అసభ్య ప్రవర్తనలను అరికట్టేందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రయాణాల సమయంలో, షాపింగ్ కేంద్రాలు, బస్టాండ్‌లు, ఇతర రద్దీ ప్రాంతాల్లో మహిళలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా ఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.ముఖ్యంగా సోషల్ మీడియా ద్వారా వచ్చే మోసపూరిత లింకులు, ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. మహిళలు, బాలికలపై అసభ్య ప్రవర్తన లేదా వేధింపులకు పాల్పడిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు.ఈ సందర్భంగా వర్ధన్నపేట ఎస్సైసాయిబాబు మాట్లాడుతూ,"సంక్రాంతి పండుగను మహిళలు భయంలేకుండా ఆనందంగా జరుపుకోవాలన్నదే పోలీస్ శాఖ లక్ష్యం. మహిళల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవు. మహిళల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత" అని అన్నారు.పండుగ వాతావరణంలో శాంతి, భద్రతలు నిలవాలంటే ప్రజలు పోలీసులకు సహకరించాలని వర్ధన్నపేట పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# మధర్ తెరిస్సా టెక్నో స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు

## పాఠశాల చిన్నారులతో కలిసి పాల్గొన్న సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్

**సత్తుపల్లి/జనవరి 10 (జర్నలిస్ట్ వార్త):**
సత్తుపల్లి పట్టణంలోని మధర్ తెరిస్సా టెక్నో స్కూల్‌లో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పాఠశాల చిన్నారులతో కలిసి ఉత్సాహంగా పాల్గొని సంక్రాంతి పండుగ శు భాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాగమయి దయానంద్ మాట్లాడుతూ, సత్తుపల్లి నియోజకవర్గ ప్రజలందరికీ, ముఖ్యంగా పాఠశాల విద్యార్థులకు ముందస్తుగా సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని ఆకాంక్షించారు.

పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులతో కలిసి భోగి మంటల వద్ద ఆటపాటల కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, చిన్నారులతో కలిసి కోలాటం ఆడుతూ ఉత్సాహాన్ని నింపారు. హరిదాస్ వేషధారణలో ఉన్న చిన్నారులను ప్రత్యేకంగా అభినందించారు.

ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, సత్తుపల్లి



నియోజకవర్గంలోని విద్యార్థులు చదువులో ముందుండాలని ఆకాంక్షించారు. అలాగే సంక్రాంతి సెలవుల సమయంలో పిల్లలను తల్లిదండ్రులు జాగ్రత్తగా చూసుకోవాలని సూచనలు చేశారు.

ఈ సందర్భంగా సత్తుపల్లి నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలకు, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, సిబ్బందికి ప్రత్యేకంగా సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. పాఠశాల చిన్నారులతో సరదాగా గడుపుతూ కార్యక్రమాన్ని మరింత ఆనందంగా మార్చారు.



# 10 వేల క్రికెట్ చెస్ కిట్ అందజేసిన కానిస్టేబుల్ కుమార్




**స్టేషన్ ఘన్ పూర్/జనవరి 10 (జర్నలిస్ట్ వార్త) :** మండలంలోని తాటికొండ గ్రామానికి చెందిన యువకులు సంక్రాంతి పండుగ సందర్భంగా గతంలో స్టేషన్ ఘన్పూర్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహించిన కానిస్టేబుల్ మసి కుమార్ శనివా రం తాటికొండ యువతకు 10 వేల విలువైన క్రికెట్ కిట్టు, చెస్ కిట్టు అందజేశారు. తాటికొండ చుట్టుపక్కల గ్రామాలు అయినటువంటి ఫతేపూ ర్,చిల్పూర్ గ్రామాలలో జరిగే క్రికెట్ క్రీడా ఉత్సవా ల సందర్భంగా గతంలో స్టేషన్గన్పూర్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వర్తించిన కానిస్టేబుల్ మసి కుమార్ ని సంప్రదించగా హనుమకొండలో10వేల రూపాయల విలువగల క్రికెట్ కిట్, చెస్ కిట్టు ఇప్పించడం జరిగింది.ఈ సందర్భంగా కానిస్టేబుల్ మసి కుమార్ మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించడం కోసం క్రికెట్,చెస్ కిట్ ల కోసం పదివేల రూపాయలు చేయడం జరిగిందని అన్నా రు. యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించి ప్రయోజకులు కావాలని అన్నారు. క్రికెట్,చెస్ కిట్ అందజేసిన కుమార్ ను యువత అభినందించా రు. ఈ కార్యక్రమంలో తాటికొండ గ్రామానికి చెంది న యువకులు మారపాక ఎల్ల స్వామి,అనంతపు రం హరిప్రసాద్, మారపాక సందీప్, మారపాక నాగరాజ్ (ఎమ్ ఎన్ ఆర్ ),మారపాక శ్యామ్ తది తరులుపాల్గొని,స్వతహాగాక్రీడాకారుడైనటువంటి కుమార్ కానిస్టేబుల్ ఫోన్ చేసి అడగగానే క్రీడల పై మక్కువతో పదివేల రూపాయల క్రీడా సామా గ్రిని అందించడం జరిగిందని అన్నారు.ఈ సంద ర్భంగా కృతజ్ఞలు తెలియజేయడం జరిగింది.

# సంజీవరావు భౌతికకాయానికి నివాళులు అర్పించిన సర్పంచి ఉప సర్పంచ్



**తల్లాడ/జనవరి10(జర్నలిస్ట్ వార్త):** మండలం నారాయణపురం గ్రామం లో తడికమళ్ళ సంజీవరావు శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో స్వర్గస్తులైనారు ఈ విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ తల్లాడ మండల అధ్యక్షులు రెడ్డెం వీర మోహన్ రెడ్డి , తల్లాడ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పెరిక నాగేశ్వరావు (చిన్నబ్బాయి) సంజీవరావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కర్నాటి లక్ష్మరెడ్డి, వార్డు మెంబర్లు మరియు బిఆర్ఎస్ పార్టీ తల్లాడ మండల టౌన్ ఉపాధ్యక్షులు సంఘసాని శ్రీను, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# విశ్వశాంతి లో తెలుగుదనం ఉట్టిపడేలా సంక్రాంతి సంబరాలు.

## - గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల గానం. - బొమ్మల కొలువు, భోగిపళ్ళు, కోలాట నృత్యాలు.



**సత్తుపల్లి/జనవరి10(జర్నలిస్ట్ వార్త):** తెలుగు సంస్కృతి, సాంప్రదాయం, కట్టు, బొట్టు, వేషధారణ ఉట్టిపడేలా శనివారం స్థానిక విశ్వశాంతి విద్యాలయంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా, హుషారుగా జరిగాయి.మామిడాకుల తోరణాలు, బంతిపూల దండలు, గంగిరెద్దులు, కోడిపుంజులు, హరిదాసులు, సోదిమ్మ తదితర వేషధారణలతో పల్లె వాతావరణం సృష్టించారు.



విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి సంక్రాంతి సంతోషాలను వేడుక రూపంలో కనువిందు చేశారు. చిన్నారులకు భోగి పళ్ళు పోసి ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని వారిని టీచర్స్ ఆశీర్వదించారు.సంక్రాంతి వైభవాన్ని తెలిపే పాటలకు సాంప్రదాయ దుస్తులతో నృత్యం చేస్తూ హోరెత్తించారు . మూడు రోజుల సంక్రాంతి పండుగలో మొదటి రోజైన భోగి పండుగవైభవాన్ని తెలుపుతూ విద్యార్దులు , ఉపాధ్యాయులు కలసి కోలాట నృత్యంతో భోగిమంటల చుట్టూ నృత్యం చేస్తూ ఉత్సాహాన్ని నింపారు.



హరిదాసుల గానం, కోడిపందాలు ,గంగిరెద్దుల విన్యాసాలు, బొమ్మల కొలువు , భోగి పళ్ళు, సాంప్రదాయ దుస్తులు ధరించిన చిన్నారులు ఈ వేడుకలో ప్రధాన ఆకర్షణగా నిలిచారు. అనేక సంవత్సరాలుగా హరి నామ కీర్తనలతో ఆకట్టుకుంటున్న రమణ, గంగిరెద్దుల విన్యాసాలను చేసేవారిని ఈ సందర్భంగా సన్మానించి వారికి ఆర్థిక సహాయం అందజేశారు.

కార్యక్రమంలో విశ్వశాంతి యాజమాన్యం పసుపులేటి నాగేశ్వరరావు, నరుకుల్ల సత్యనారాయణ, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆకలికి అన్నమే సమాధానం!

## వివేకానంద జయంతికి మానవతా నివాళి -- లయన్స్ క్లబ్ హంగర్ సర్వీస్ వారోత్సవాలు

**సత్తుపల్లి/జనవరి 10 (జర్నలిస్ట్ వార్త):**
ఆకలి రాజకీయాలకు అతీతమని, మానవత్వమే నిజమైన సేవ అని సత్తుపల్లి లయన్స్ క్లబ్ మరోసారి నిరూపించింది. పేదల ఆకలి తీర్చడమే లక్ష్యంగా చేపట్టిన హంగర్ సర్వీస్ వారోత్సవాల్లో భాగంగా, స్వామి వివేకానంద 164వ జయంతి సందర్భంగా శనివారం సత్తుపల్లి పోస్ట్ ఆఫీస్ సమీపంలో 150 మంది నిరుపేదలకు అన్నదానం నిర్వహించి మానవతా విలువలకు సజీవ రూపమిచ్చింది.

వేదికలపై ప్రసంగాలకు పరిమితమయ్యే సేవాభావం కాకుండా, రోడ్డుపైకి వచ్చి ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడమే నిజమైన సేవ అన్న సందేశాన్ని ఈ కార్యక్రమం బలంగా చాటి చెప్పింది. హంగర్ వీక్ కార్యక్రమాల్లో ఏడవ రోజు నిర్వహించిన ఈ సేవా కార్యక్రమంలో లయన్ గంద్ర సోమిరెడ్డి, పెనుగొండ రమేష్, రమణ, పసుమర్తి గోపాలరావు, సలీం, గార్లపాటి సత్యనారాయణ, చింతలపాటి శ్రీనివాసరావు, విజయసారధి రెడ్డి, వలి, చల్లగుండ్ల అప్పారావు, గట్టే వాసు తదితరులు పాల్గొని సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



ఈ సందర్భంగా ప్రైవేట్ స్కూల్స్ సత్తుపల్లి డివిజన్ అధ్యక్షులు పసుపులేటి నాగేశ్వర రావు మాట్లాడుతూ "మానవ సేవే మాధవ సేవ" అనే స్వామి వివేకానంద సూక్తిని ఆచరణలో పెట్టడమే లయన్స్ క్లబ్ ప్రత్యేకత అని ప్రశంసించారు. హంగర్ వీక్ కార్యక్రమాల ద్వారా ఆకలిపై సమాజంలో చైతన్యం తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు.



ఆకలితో అలమటించే వారి ముఖాల్లో చిరునవ్వు తీసుకురావడమే నిజమైన అభివృద్ధి అని, అన్నమే మహాదానం అన్న సత్యాన్ని ఈ కార్యక్రమం మరోసారి గుర్తు చేసింది. స్వామి వివేకానంద ఆశించిన మానవతా సమాజ నిర్మాణానికి ఇలాంటి సేవలే పునాది అని చెప్పకనే చెప్పింది. హంగర్ సర్వీస్ వారోత్సవాలు సత్తుపల్లిలో మానవత్వానికి చిరునామాగా నిలిచాయి.